క్లుప్తంగా

డీఎస్పీలకు సత్కారం



డీఎస్పీలు అంబికా ప్రసాద్, మురళీ మోహన్‌లను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, దిశ డీఎస్పీ ఎస్.మురళీమోహన్‌లను స్థానిక నల్లా వీధి విజయదశమి ఉత్సవ కమిటీ ప్రతినిధులు స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. డీఎస్పీలకు విజయదుర్గ అమ్మవారి చిత్రపటాలను బహుకరించారు. దసరా ఉత్సవాల ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీలు సూచించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆశెట్టి ఆదిబాబు, నల్లా రాంబాబు, దున్నాల బాబి, ఆశెట్టి అర్జున్ తదితరులు డీఎస్పీలను సత్కరించారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

యానాం: స్థానిక భూసమేత వేంకటేశ్వర స్వామి(మీసాలవెంకన్న) ఆలయంలో గురువారం స్వామివారికి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. వైఖానస ఆగమ విద్వాన్ వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆర్యవైశ్య సంఘం ఉత్సవదారులుగా స్వామివారికి సువర్ణ పుష్పార్చన, ముత్యాల హారతి, సహస్ర నామార్చన జరిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారి ఖండవల్లి రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: పట్టణ పరిధిలోని కాకివారి వీధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన నాగేశ్వరరావు కుటుంబసభ్యులను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ గురువారం పరామర్శించారు. ప్రమాదంలో కాలిపోయిన ఇంటిని పరిశీలించారు. అగ్నిప్రమాదం జరిగిన తీరుని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా సాయం చేస్తామని బాధితులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జిప్‌మెర్ ఆసుపత్రిలో పోస్టులకు నోటిఫికేషన్

యానాం: యానాం జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మెర్) ఆసుపత్రిలో వివిధ పోస్టులకు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. స్పెషలిస్ట్-9, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్-20, నర్సింగ్ ఆఫీసర్-25, ఎక్స్‌రే టెక్నీషియన్-5, మెడికల్ ల్యాబరేటరీ టెక్నీషియన్-27, ఫార్మాసిస్ట్-2, స్టెనోగ్రాఫర్-1, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-2 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. డిసెంబర్ 2న నిర్వహించే రాతపరీక్ష ద్వారా పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. www.jipmer.edu.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం: ముమ్మిడివరం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు అమలాపురం ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

రూ.50 వేల విరాళం



పీఠాధిపతి కామేశ మహర్షికి రూ.50 వేల విరాళాన్ని అందజేస్తున్న ప్రభాకర్

అమలాపురం టౌన్: స్థానిక కామాక్షీ పీఠంలో అనాథ పిల్లలు పెరిగే ప్రేమ మందిరానికి కాకినాడకు చెందిన కొప్పిశెట్టి ప్రభాకర్ రూ.50 వేల విరాళాన్ని పీఠాధిపతి కామేశ మహర్షికి గురువారం అందజేశారు. ఉద్యోగ రీత్యా లండన్‌లో స్థిరపడిన ప్రభాకర్ బండార్లంకలోని అత్తవారింటికి వచ్చి పీఠంలో వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్



మురమళ్లలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



జగనన్న ఆరోగ్య సురక్ష పత్రాలను అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

ప్రజలందరి ఆరోగ్య రక్షణ కోసమే సురక్ష

ఉప్పలగుప్తం: ప్రజలందరి ఆరోగ్య రక్షణ కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని వానపల్లిపాలెంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో 501 మందికి వైద్య పరీక్షలు, 78 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌లు యర్రంశెట్టి రామచంద్రరావు, నల్లా వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధులతో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి అధ్యక్షతన గోడితిప్ప యూపీ స్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గురువారం నిర్వహించారు. శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి రామరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొప్పాడి వెర్రియ్య, ఎంపీడీఓ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

తాళ్లరేవు: స్థానిక మాధవరాయునిపేట ప్రాథమిక పాఠశాలలో స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో సుమారు 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.పోతురాజు, పంచాయతీ కార్యదర్శి నున్న శంకరనారాయణ, ఎంపీటీసీ సభ్యులు నందికోళ్ల శ్రీదేవి, చిట్టూరి లలిత పద్మ, రత్న ముత్యాలు, ఆకుల వెంకటేశ్వర్లు, చిట్టూరి చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా ఇంటింటికీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య అదనపు అధికారిని భరతలక్ష్మి అన్నారు. గురువారం మురమళ్లలో సర్పంచ్ కాశే రాజుబాబు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 452 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఝాన్సీకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, వీరేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలందరికీ మెరుగైన వైద్యం అందుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక కల్వకొలనువీధి వార్డు సచివాలయంలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. శిబిరంలో 300 మంది రోగులు వైద్యసేవలు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, కల్వకొలను ఉమ, పిండి రాజా తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరరావు అన్నారు. గురువారం సీహెచ్ గున్నేపల్లి సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. శిబిరంలో 714 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జి.వీరహనుదుర్గ పద్మజ, ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, గొలకోటి రాజబాబు, జి.అంజనేయులు, జి.కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



గోడిలోని బాలికల గురుకుల పాఠశాలలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: మండలంలోని గోడిలో ఉన్న బాలికల గురుకులాన్ని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉంచుకోవాలని, కలుపు మొక్కలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనాలు అందించాలన్నారు. విద్యార్థుల చేత పనులు చేయించవద్దని సూచించారు. రాత్రి వేళల్లో వాచ్‌మెన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ కృష్ణమోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు దొమ్మేటి వెంకటేశ్వరరావు, రేవు శ్రీనివాసరావు, జల్లి ఏడుకొండలు, కుక్కల అర్జునరావు ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై సీజీఆర్‌ఎఫ్‌కు ఫిర్యాదుచేయండి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

అమలాపురం రూరల్: వినియోగదారులు విద్యుత్ సమస్యలపై సీజీఆర్‌ఎఫ్‌కు ఫిర్యాదుచేయాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం(సీజీఆర్‌ఎఫ్) చైర్మన్, రిటైర్డ్ జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. గురువారం భట్లపాలెంలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు విద్యుత్ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేసి విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సమస్యల పరిష్కార న్యాయస్థానం టెక్నికల్ సభ్యుడు వి.జనార్ధన్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ మోకా రవికుమార్, ఏఈలు ఏవీవీ ప్రసాదరావు, అప్పారి హరిబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక

అమలాపురం టౌన్: స్థానిక విద్యానిధి స్కూలులో గురువారం జరిగిన జిల్లా చెస్ అండర్-13 పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా చెస్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ తెలిపారు. బాలుర విభాగంలో బందారు నానిబాబు ప్రథమ స్థానాన్ని, పితాని ధ్యాన సత్య కార్తీక్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. బాలికల విభాగంలో గెద్దాడ అక్షయ ప్రథమ స్థానాన్ని, గిడుగు వాత్సల్య ద్వితీయ స్థానాన్ని సాధించారని చెప్పారు. విజేతలకు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాదాసు కిషోర్, విద్యానిధి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌బాబు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేసిన జిల్లా చెస్ అసోసియేషన్ నిర్వాహకులు

రూ.20 స్టాంపు విధానంపై చర్చ

అమలాపురం టౌన్: కోర్టుల్లో వివిధ కేసుల నిమిత్తం పిటీషన్లు వేసేటప్పుడు రూ.20 వెల్ఫేర్ స్టాంపు అతికించే విధానంపై స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 14 బార్ అసోసియేషన్లకు చెందిన న్యాయవాదులు గురువారం సమావేశమై చర్చించారు. అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండ్రు ఫణీంద్ర లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వెల్ఫేర్ స్టాంపు అతికించే అంశంపై చర్చించి వ్యతిరేకతను వ్యక్తం చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు డి.బాబి, కుడుపూడి త్రినాథ్, మాకే ఆదినారాయణ, మట్టపర్తి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బార్ అసోసియేషన్ల న్యాయవాదులు

పాలిటెక్నిక్ కళాశాలలో ల్యాబ్‌ల ప్రారంభం

యానాం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన కంప్యూటర్ ల్యాబ్, సివిల్ డిపార్ట్‌మెంట్ ల్యాబ్‌లను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ గురువారం ప్రారంభించారు. అనంతరం కళాశాల పేరుతో కూడిన నూతన ఆర్చ్‌ను సైతం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక విద్యకు మంచి ఉద్యోవకాశాలు లభ్యమవుతున్నాయన్నారు. విద్యార్థులంతా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాలలో తరగతి గదులను పరిశీలించి అధ్యాపకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



సాంకేతిక పరికరాల గురించి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- గొల్లవిల్లిలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం

ఉప్పలగుప్తం: కుల, మత, పార్టీలకు అతీతంగా ఇంటింటికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గొల్లవిల్లి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులతో కలిసి 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం గురువారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సరే సంక్షేమాన్ని మాత్రం నిర్లక్ష్యం చేయలేదని గుర్తుచేశారు. ఇదే పరిస్థితి టీడీపీ హయాంలో వచ్చి ఉంటే చంద్రబాబు సంక్షేమాన్ని పూర్తిగా పక్కదారి పట్టించేసేవారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎం చేసేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మంత్రి తనయుడు పినిపే శ్రీకాంత్, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దంగేటి రాంబాబు, చెల్లుబోయిన శ్రీనివాస్, సర్పంచులు జొన్నాడ శ్రీదుర్గ, కడిమి చిన్నరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, పెయ్యిల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లవిల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్

ఆర్‌బీకేలతో అన్నదాతలకు భరోసా

అమలాపురం రూరల్: విత్తు నుంచి విక్రయం వరకూ అన్నదాతలకు అన్నివిధాలా భరోసా కల్పించాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం ఆర్‌బీకేలను ఏర్పాటుచేసిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. రెడ్డిపల్లిలో రూ.23 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారుల చేతిలో పెట్టి మోసపోకుండా రైతు భరోసా కేంద్రాల్లో మద్దతు ధర అందించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి హరిరామ్‌గోపాల్, సర్పంచ్ కరాటం ప్రసన్న, పశుసంవర్ధక శాఖ ఏడీఏ విజయరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏవో కడలి ధర్మ ప్రసాద్, కార్యదర్శి కట్టా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



రెడ్డిపల్లిలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

పిల్లలపై కుక్కల దాడులు



కుక్కల దాడిలో గాయపడిన పాలెపు లహరి

కాట్రేనికోన: మండలంలోని పల్లం పంచాయతీలో చిన్నారులపై కుక్కలు సామూహికంగా దాడులు చేస్తున్నాయి. గత రెండు రోజుల నుంచి నలుగురిపై విచక్షణారహితంగా దాడి చేయడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పల్లం పంచాయతీ కాలభైరవస్వామి ఆలయం సమీపంలో రెండు కుక్కలు ఆలయ అర్చకుడి భార్యపై దాడి చేశాయి. ఎనిమిదేళ్ల చిన్నారి భానుశ్రీని విచక్షణా రహితంగా కరిచాయి. ఐదేళ్ళ అమ్మాయి పాలెపు లహరి, ఏడేళ్ళ బాలుడు పాలెపు కాసుబాబులపై కుక్కలు దాడి చేశాయి. కుక్క కాటుకు గురైన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వాక్సిన్ వేయించారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గాయత్రీదేవి నమోస్తుతే..

- అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఉప్పలగుప్తం: వానపల్లిపాలెంలో కొలువైయున్న శ్రీవిజయదుర్గ ఆలయం వద్ద వేద పండితులు మాగాపు నాగేంద్ర వరప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముమ్మిడివరం: మండలంలోని గోదశివారిపాలెంలో విజయదుర్గమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని 9000 గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. చినకొత్తలంక విజయదుర్గమ్మ వారిని చండీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

తాళ్లరేవు: మండలంలోని నీలపల్లిలో మీనాక్షి సమేత, నీలకంఠేశ్వర స్వామి ఆలయ నిర్మాణకర్త కంచర్ల వెంకట నాగేశ్వరరావు, అన్నపూర్ణ దంపతులు చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితులు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో నిర్వహించిన పూజల్లో భాగంగా హోమగుండంలో పరమశివుడు, కనకదుర్గ ప్రతిరూపాలు కనిపించడంతో భక్తులంతా ఆనందపరవశులయ్యారు.

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి ఆలయంలో గురువారం అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని వైష్ణవీ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మి అమ్మవారిగా దర్శనమిచ్చారు. స్థానిక నల్లా వీధి రామాలయం వద్ద దసరా శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా నెలకొల్పిన శ్రీవిజయదుర్గమ్మవారు గురువారం రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో అలంకృతమై శ్రీమహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక నల్లా వీధిలో మహాలక్ష్మి అలంకరణలో ఉన్న విజయ దుర్గమ్మను కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులను అభినందించారు. అనంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధులు కలెక్టర్ శుక్లాను ఘనంగా సత్కరించారు.

ఐ.పోలవరం: దేవీనవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు అమ్మవారు లలితాత్రిపుర సుందరీ దేవిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. మురమళ్ల విజయదుర్గ అమ్మవారి ఆలయంలో చండీ హోమం ఘనంగా నిర్వహించారు.



గోదశివారిపాలెంలో లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు



చినకొత్తలంకలో చండీదేవిగా అమ్మవారు



శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తున్న అమలాపురం శ్రీదేవి అమ్మవారు



కలెక్టర్ హిమాన్షు శుక్లాను సత్కరిస్తున్న దసరా ఉత్సవ కమిటీ ప్రతినిధులు



వానపల్లిపాలెం విజయదుర్గ ఆలయంలో చండీ యాగం చేస్తున్న భక్తులు



రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిలా అలంకృతమైన నల్లా వీధి విజయదుర్గ అమ్మవారు

అందుబాటులోకి సమగ్రాభివృద్ధి ప్రణాళిక

యానాం: ప్రతిపాదిత భూవినియోగ పటాలు, భూ వినియోగ రిజిస్టర్‌తో తయారుచేసిన యానాం సమగ్రాభివృద్ధి ప్రణాళిక-2041 ప్రజల పరిశీలన కోసం స్థానిక యానాం ప్లానింగ్ అథారిటీ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు మెంబర్ సెక్రటరీ సత్యబాది నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. యానాం రీజియన్ అభివృద్ధి కోసం ప్రణాళికా రిజిస్టర్ సంబంధించి ఏవైనా అభ్యంతరాలు, సూచనలు చేయాలనుకునే వ్యక్తులు ప్లానింగ్ అథారిటీ సభ్య కార్యదర్శికి రాతపూర్వకంగా పంపాలని కోరారు. అధికారిక గెజిట్‌లో ప్రచురించిన 60 రోజుల్లోపు అభ్యంతరాలను తెలపవచ్చన్నారు.

సెలవులకు ఊరెళితే ఇంట్లో చోరీ

యానాం: పట్టణ పరిధిలోని శ్రీరామ్‌నగర్ 4వ వీధిలో బుధవారం అర్ధరాత్రి దొంగతనం చోటుచేసుకుంది. ఉపాధ్యాయురాలు వ్రే శివకుమారి దసరా సెలవులు కావడంతో కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. దీంతో దొంగలు శివకుమారి ఇంటి తలుపులు బద్దలుకొట్టి చోరీకి పాల్పడ్డారు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ శేరు నూకరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటి యాజమానురాలు శివకుమారి శుక్రవారం హైదరాబాద్ నుంచి రానున్నారని, ఆమె వస్తే తప్ప ఇంట్లో ఏ వస్తువులు దొంగతనానికి గురయ్యాయో తెలియదని ఎస్ఐ చెప్పారు.